సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 25 । జనవరి । 2024



ఉద్యమాలకు ఊపిరి లెనిన్

సిరిసిల్లటౌన్: ప్రజా ఉద్యమాలకు ఊపిరి లెనిన్ అని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం లెనిన్ శతవర్ధంతి జరిపారు.



డైరీ ఆవిష్కరణ

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ ఎకనామిక్ స్టాటిస్టికల్, సబార్డినేట్స్ అసోసియేషన్ (టెస్సా) 2024 డైరీని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆవిష్కరించారు.

గరిష్టం/కనిష్టం
29.0/18.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

హెల్త్‌ప్రొఫైల్ ఏమైనట్లు?

● పైలట్ ప్రాజెక్టును పక్కన పెట్టారు ● జిల్లాలో 3.47 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు ● 91 శాతం పూర్తి

రాజన్నసిరిసిల్ల జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన హెల్త్‌ప్రొఫైల్‌పై స్పష్టత కరువైంది. దేశంలోనే తొలిసారిగా సమగ్ర ఆరోగ్య సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను ఏడాదిన్నర క్రితం నిర్వహించారు. రాష్ట్రంలోని రాజన్నసిరిసిల్ల, ములుగు జిల్లాల్లో ఈ–హెల్త్ ప్రొఫైల్ సర్వేలు చేశారు. 2022 మార్చి 5న అప్పటి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు వేములవాడలో ఈ–హెల్త్ ప్రొఫైల్ పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో 91 శాతం మేరకు పూర్తయింది. కానీ ఈ–హెల్త్ ప్రొఫైల్స్ ఇంకా అందుబాటులోకి రాలేదు. దీనిపై స్పష్టత కరువైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్‌కార్డులు జారీ చేస్తామని ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో పత్తా లేని పైలట్ ప్రాజెక్టు డిజిటల్ హెల్త్ కార్డులపై కథనం..



మహిళ బరువును చూస్తున్న వైద్యసిబ్బంది(ఫైల్)



రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా 2022 మార్చిలో ఆరోగ్య కార్యకర్తల బృందాలు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాయి. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి సుమారు 30 రకాల ఆరోగ్య పరీక్షలు చేశారు. ఇందులో బ్లడ్‌గ్రూప్, రక్తహీనత, కిడ్నీ, కాలేయ సంబంధిత పరీక్షలను సిరిసిల్లలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో పరీక్షల వివరాలు 'డిజిటల్ హెల్త్ ప్రొఫైల్' రూపంలో కంప్యూటర్‌లో భద్రపరిచారు. ఈ సమాచారాన్ని ఆధార్‌కార్డు, మొబైల్‌నంబర్‌తో అనుసంధానించినట్లు ప్రకటించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వ్యక్తులకు అవసరమైన మందులను ఉచితంగా ఇస్తామని వెల్లడించారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడమే ఈ–హెల్త్ ప్రొఫైల్ లక్ష్యంగా స్పష్టం చేశారు. జిల్లాలోని కొందరు అందుబాటులో లేకపోవడం, గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారు, స్థానికంగా అందుబాటులో లేని వారు మినహా జిల్లాలో 91 శాతం మేరకు సర్వే పూర్తయింది.

ఇదీ లక్ష్యం

ప్రతి ఒక్కరి పరీక్షల నివేదికలతో ప్రత్యేక ఆరోగ్య గుర్తింపు సంఖ్యతో 'ఆరోగ్యకార్డు'లో భద్రపరచి ఇస్తారు. అత్యవసర పరిస్థితుల్లో(ఎమర్జెన్సీ) ఈ డిజిటల్‌కార్డులో తక్షణమే వైద్యసేవలందించేందుకు వీలుంటుంది. బ్లడ్‌గ్రూప్‌తోపాటు ఇతర అంశాలపై డాక్టర్‌కు ఆరోగ్య సమాచారం తెలిసి వైద్యం చేసేందుకు అవకాశం కలుగుతుంది. ఈ ప్రాజెక్టు ప్రారంభించి ఏడాదిన్నర గడుస్తున్నా ఈ డిజిటల్ కార్డులు ప్రజలకు అందుబాటులోకి రాలేదు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ హెల్త్‌కార్డులు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో గతంలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు ఏమైనట్లు అనే అనుమానాలు కలుగుతున్నాయి.

ఆధునిక పరిజ్ఞానంతో పరీక్షలు

సిరిసిల్లలో టీ–డయాగ్నోస్టిక్ సెంటర్‌ను రూ.30 కోట్లతో ఏర్పాటు చేశారు. ఇందులో మూడు ఇంటిగ్రేటెడ్ అనలైజర్ మిషన్‌లు, నాలుగు సీపీబీ అనలైజర్లు, ఆరు రక్తగ్రూపులు, సెంట్రల్ ఫ్యూజియర్‌లను ఏర్పాటు చేసి రోజుకు సగటున 6వేల రక్త నమూనాలను పరీక్షిస్తూ.. ఆ వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేశారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు గోప్యంగా ఉంచారు.

జిల్లాలో ఈ–హెల్త్ ప్రొఫైల్ స్వరూపం

గ్రామాలు	: 255
పట్టణాలు	: 02
పీహెచ్‌సీలు	: 18
సర్వేచేసిన బృందాలు	: 203
18 ఏళ్లు పైబడిన వారు	: 3,80,905
ఇప్పటికే సర్వే పూర్తయిన వారు	: 3,47,565

స్పష్టత రాలేదు



జిల్లాలో ఈ–హెల్త్ ప్రొఫైల్ సర్వే వేగంగా పూర్తి చేశాం. ఆ వివరాలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో నిర్ణయం తీసుకుని డిజిటల్ హెల్త్‌కార్డులు ఇవ్వాల్సి ఉంది. హెల్త్ ప్రొఫైల్‌పై ఇంకా స్పష్టత రాలేదు. జిల్లాలో 3.47 లక్షల మంది హెల్త్ ప్రొఫైల్స్ రికార్డులు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– డాక్టర్ సుమన్ మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అదనపు కలెక్టర్ గౌతమి

● ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
● సిరిసిల్లలో జాతీయ బాలికల దినోత్సవం

సిరిసిల్ల: బాలురతో దీటుగా బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణం గీతానగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన వేడుకలకు హాజరై మాట్లాడారు. బాలికలు, మహిళల అభివృద్ధికి నిధులు, ప్రత్యేక పథకాలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తుందని తెలిపారు. బాలికలు భవిష్యత్‌లో టీచర్లు, శాస్త్రవేత్తలు, ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలని సూచించారు. పెద్దలు చెప్పిన సూచనలు పాటించాలన్నారు. మహిళలతో ఇంటికి అందం వస్తుందని, వారిని గౌరవిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం స్కూల్ ఆవరణలోని విద్యార్థులకు చాక్లెట్స్ పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి మాట్లాడుతూ విద్యార్థినులు గొప్ప ఆశయంతో చదవాలన్నారు. విద్యతోనే మార్పు సాధ్యమని స్పష్టం చేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

బాలికల దినోత్సవం సందర్భంగా పలువురు విద్యార్థినుల నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినిల కరాటే ప్రదర్శన ఆత్మవిశ్వాసం నింపింది. ఇటీవల జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డీఈవో రమేశ్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఎంపీపీలు గంగం స్వరూపారాణి, పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల, స్థానిక కౌన్సిలర్ వెల్దండి దేవదాస్, జీసీడీవో పద్మజ, జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం శారద, సీడీపీవో అలేఖ్య, సఖీ కేంద్రం కేంద్రం అధికారులు రోజా, సుచరిత, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నాగుల సత్యనారాయణ, చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, అడ్డగట్ల శంకర్, కాముని వనిత, వెల్ముల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● కలెక్టర్ అనురాగ్ జయంతి
● బద్దెనపల్లి అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. మండలంలోని బద్దెనపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, కేంద్రంలోని సరుకుల గురించి తెలుసుకున్నారు. పిల్లలకు కూరగాయలు, పండ్ల చిత్రాలు చూపించి వాటి పేర్లు చెప్పమని అడిగారు. పలకపై ఏ, బీ, సీ, డీలు రాసి చదివిపించారు. పిల్లల్లో సృజనాత్మకత పెంపొందేలా కార్యక్రమాల రూపొందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక హైస్కూల్‌లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'అనీమియా ముక్త్ భారత్' పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అడిషనల్ కలెక్టర్ గౌతమి పూజారి, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్ రావు, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, ఐసీడీఎస్ సీడీపీవో అలేఖ్య, సూపర్‌వైజర్ సుస్మిత, ఆర్‌బీఎస్‌కే అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా సీఎమ్మార్ పూర్తి చేయాలి

● అడిషనల్ కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్
● తంగళ్లపల్లిలో రైస్‌మిల్లుల తనిఖీ



తంగళ్లపల్లిలో రైస్‌మిల్లులు తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): నిర్దేశిత గడువు ఈనెలాఖరులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్) సరఫరా పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ మిల్లర్లను ఆదేశించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు రామన్నపల్లి, బస్వాపూర్‌లోని రైస్‌మిల్లులను బుధవారం పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రోజువారీగా లక్ష్యం నిర్దేశించుకుని బియ్యం సరఫరాను పూర్తి చేయాలని సూచించారు. తనిఖీలో జిల్లా పౌరసరఫరాల అధికారి జి తేందర్ రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కొత్త చెరువుపై సదుపాయాలు కల్పించాలి

● గణతంత్ర వేడుకలకు సిద్ధం చేయాలి
● అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమి



అధికారులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

సిరిసిల్లటౌన్: కొత్తచెరువు సందర్శనకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ పూజరి గౌతమి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మినీ ట్యాంక్‌బండ్‌ను బుధవారం సందర్శించి మాట్లాడారు. శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, వసతులు పూర్తి స్థాయిలో కల్పించాలన్నారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ఈనెల 26వ తేదీ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిల్లెట్ ఫుడ్‌స్టాల్ తదితర ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గణతంత్ర వేడుకల సందర్భంగా విద్యార్థులతో దేశభక్తి, జాతీయ సమైక్యత, సౌభాతృత్వంను పెపొందించే విధంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ ఎండీ ఆయాజ్, అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

తెలంగాణతల్లి విగ్రహావిష్కరణ



తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ఎంపీపీ చంద్రయ్య

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని రామన్నపేటలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సర్పంచ్ కాదాస్ సంతోష్, ఉపసర్పంచ్ మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఎర్ర మల్లేశ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



రేష్మను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని దమ్మన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మర్కంటి రేష్మ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. ఈనెల 18, 19 తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ప్రదర్శనలో రేష్మ ప్రతిభ కనబర్చింది. లైఫ్‌స్టైల్ ఫర్ ఎకో సిస్టం అనే ఉపఅంశంలో గైడ్‌టీచర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో 'పీరియడ్ మిత్ర రిస్ట్ వాచ్' అనే ఆవిష్కరణ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. వృద్ధులు, రోగులు, మానసిక వికలాంగులు ధరించిన డైపర్స్‌ను సకాలంలో మార్చుకోవాలని ఈ ప్రయోగం గుర్తు చేసేలా ఉంది. రేష్మను హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు బోయన్నగారి నారాయణ, రాజు, శ్రీధర్, భాస్కర్ అభినందించారు.

ఆదర్శలో ఆకట్టుకున్న స్టార్టప్ ప్రదర్శన



బీట్‌రూట్ లడ్డూలతో బోయినపల్లి విద్యార్థినులు

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లిలోని మోడల్‌స్కూల్‌లో బిజినెస్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం జిల్లా స్థాయి స్టార్టప్ ఎగ్జిబిట్ల ప్రదర్శనలు నిర్వహించారు. ఎగ్జిబిట్ల ప్రదర్శనలో బోయినపల్లి 2 టీమ్స్, గంగాధర 7 టీమ్స్, రామడుగు 4 టీములు మొత్తం 17 టీములు పాల్గొన్నాయి. ఒక్కో టీమ్ ఒక్కో ఎగ్జిబిట్‌ను ప్రదర్శించింది. బీట్‌రూట్ లడ్డూలు, డెలీషియస్ కేక్స్, బ్యాంగిల్స్, ఎంబ్రాయిడరీ వర్క్స్ ప్రదర్శించారు. వివరాలను స్టార్టప్ కోఆర్డినేటర్ సందీప్ సేకరించారు. ప్రిన్సిపాల్స్ నిమ్మల సుధాకర్, గోల్డీ బల్బీర్‌కౌర్, డి.నాగరాజు, ఎం.డి.మునీరొద్దీన్, స్టార్టప్ ట్రైనీ టీచర్స్ రామకృష్ణ, ఆంజనేయులు, ఓంప్రసాద్, ఉమామహేశ్వరీ, సమత పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జాతీయ పతాకావిష్కరణ

● కొత్తచెరువు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు
● ముస్తాబవుతున్న కార్యాలయాలు

సిరిసిల్లకల్చరల్: గణతంత్ర దినోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సమీకృత కార్యాలయాల సముదాయాన్ని శుభ్రం చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ అనురాగ్ జయంతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి గణతంత్ర దినోత్సవ సందేశాన్ని అందిస్తారు. ఆపైన వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు బహూకరిస్తారు.

సాయంత్రం ట్యాంక్‌బండ్ పార్క్‌లో

కొత్త చెరువు మినీట్యాంక్‌బండ్ పార్క్‌లో సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథం తెలిపారు. దేశభక్తి, జాతీయ భావాలను ప్రతిబింబించేలా నాట్య ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజుతో సంబంధం లేకుండా ప్రదర్శనలు తిలకించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. పోషకాహార ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు పార్క్‌లో మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్‌ను జిల్లా సంక్షేమ శాఖ ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ప్రజలు ఈ ప్రదర్శనలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సైబర్ నేరాలపై వెంటనే స్పందించాలి



సైబర్ నేరాల నియంత్రణపై సమీక్షిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

● ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: సైబర్‌నేరాలపై వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని సైబర్ వారియర్స్‌కు ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సైబర్ వారియర్స్ శిక్షణ కార్యక్రమంలో పలు సూచనలు చేశారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతీ స్టేషన్‌లో సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించేందుకు వారియర్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కంటికి కనిపించకుండా ప్రజల సొమ్మును సైబర్‌నేరగాళ్లు దోస్తున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాలన్నారు. నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ (ఎన్‌సీఆర్‌పీ) వెబ్‌లో ఫిర్యాదు చేసేలా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగే తీరు వాటిని నియంత్రించదానికి తీసుకోవాల్సిన చర్యలపై సీఐ శ్రీధర్, ఎస్ఐ జునైద్ పవర్ ప్రజంటేషన్‌తో వివరించారు. ఏఎస్పీ చంద్రయ్య ఉన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా రాజు



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో మోర రాజు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా తంగళ్లపల్లికి చెందిన మోర రాజును బుధవారం నియమించారు. ఈమేరకు టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ నియామక పత్రాన్ని అందజేసినట్లు రాజు తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ఐదు నుంచి బండి సంజయ్ ప్రచారయాత్ర

● ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభం
● ఈనెల 28న నిర్ణయం తీసుకునే అవకాశం



బండి సంజయ్


సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పార్లమెంట్ పరిధిలో ప్రచారయాత్ర చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 5 నుంచి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకోసం త్వరలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించనున్నారు. ఈనెల28న ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగే పార్లమెంట్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలోనే యాత్రపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో మూడు పర్యాయాలు పాదయాత్ర నిర్వహించి పార్టీకి ఊపు తెచ్చిన విషయం విదితమే. అదే తరహాలో పార్లమెంట్ పరిధిలోనూ ప్రచారయాత్రతో ప్రజల మద్దతు కూడగట్టనున్నట్లు తెలుస్తోంది.

మూడు రోజులు పత్తి కొనుగోళ్లు బంద్

● జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్

సిరిసిల్ల: జిల్లాలో మూడు రోజులపాటు పత్తి కొనుగోళ్లు బంద్ చేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ బుధవారం తెలిపారు. జిల్లాలోని ఐదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేస్తున్నామని వివరించారు. అన్ని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. జనవరి 26, 27, 28 తేదీల్లో సెలవు దినాలు ఉండడంతో మూడు రోజులపాటు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. జనవరి 29న తిరిగి సీసీఐ పత్తి కొనుగోళ్లు ఉంటాయని వివరించారు.

ట్రాఫిక్‌జామ్



వేములవాడ: రాజన్న ఆలయం ఎదుట గల రోడ్డుపై బుధవారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో స్థానికులు, భక్తులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. సమ్మక్క జాతర భక్తులు ముందుగా రాజన్నను దర్శించుకునేందుకు వస్తుండడంతో వారి వాహనాలతో వేములవాడలో గత పది రోజులుగా నిత్యం ఇదే సమస్య ఎదురవుతుంది. గంటల తరబడి ట్రాఫిక్‌లోనే జనం చిక్కుకుపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించాలని, రోడ్డు విస్తరణ చేపడితే శాశ్వతంగా ఈ ఇబ్బందులు ఉండవని స్థానికులు పేర్కొంటున్నారు.



నిరసన

సిరిసిల్లటౌన్: బస్సుల కొరతను నిరసిస్తూ సిరిసిల్ల పాతబస్టాండ్ సమీపంలో విద్యార్థులు బుధవారం రాస్తారోకో చేపట్టారు. బీఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడుతూ విద్యాసంస్థల సమయాల్లో బస్సుల్లేక గ్రామీణ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యాసంస్థలు, పరీక్షల సమయాలను దృష్టిలో ఉంచుకొని బస్సులు నడిపించాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై డీఎంకు వినతిపత్రం అందించారు. మట్టె శ్రీనివాస్, నవీన్, నరేశ్, జగన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సరదా..



సిరిసిల్లటౌన్: సీనియర్ సిటిజన్స్ ఆటపాటల్లో పోటీపడుతూ బుధవారం సరదాగా గడిపారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులకు రన్నింగ్, కబడ్డీ, వాకింగ్ పోటీలు నిర్వహించారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్‌బీఎస్ మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, ఏనుగుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈత చెట్టుపై నుంచి పడి గీతాకార్మికుడికి గాయాలు



గాయపడ్డ దేవయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు పుల్లక్ దేవయ్య(65) బుధవారం ఈత చెట్టు పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దేవయ్య ఎడమ చేతికి, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానిక గౌడసంఘం ప్రతినిధులు స్పందించి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దేవయ్యకు ఎక్సైజ్ అధికారులు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. గౌడ సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్, నాగుల ప్రదీప్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి తదితరులు పరామర్శించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై రమాకాంత్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమాకాంత్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో బుధవారం నిర్వహించిన కమ్యూనిటీమీటింగ్‌లో మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

గంజాయి చాక్లెట్ల విక్రేత అరెస్టు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని బండారికుంట ప్రాంతంలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న అర్సలన్ అన్సారీని అరెస్టు చేసినట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు. అమర్‌నగర్‌లోని ఓ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్న వ్యక్తి గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నాడన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి బుధవారం దాడి చేశామన్నారు. అన్సారీని అదుపులోకి తీసుకొని, 51 చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయికి బానిసైన అతను తక్కువ సమయంలో సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆశతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి నుంచి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం పెద్దపల్లికి పలు జిల్లాల నుంచి వచ్చే యువతకు వాటిని విక్రయించవచ్చన్న ఆలోచనతో కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. తదుపరి విచారణకు యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు వివరాలు అందించినట్లు తెలిపారు. పెద్దపల్లికి రైలు మార్గం ఉండటంతో గంజాయి రవాణా సులువుగా చేస్తున్నారన్నారు. గంజాయి విక్రయిస్తూ ఇదివరకు పలువురు పట్టుబడ్డారు. యువతను మత్తుకు బానిసలుగా చేసేందుకు తక్కువ ధరకే కొంచెం గంజాయిని చాక్లెట్లు, సిగరెట్లు, ప్యాకెట్ల రూపంలో అంటగడుతున్నట్లు తెలుస్తోంది.

చలాన్ల చెల్లింపులో నిర్లక్ష్యం

- గడువు పొడగించిన ప్రభుత్వం
- ఈ నెలాఖరు వరకు అవకాశం
- జరిమానాల చెల్లింపునకు ఆసక్తి చూపని ప్రజలు



వాహనాల తనిఖీల్లో జరిమానా లెక్కిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రాజ్‌కుమార్

సిరిసిల్లక్రైం: వాహనాల పెండింగ్ చలాన్ల చెల్లింపుల్లో జిల్లా ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలల కొద్దీ పెండింగ్‌లో ఉండడంతో ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. గతేడాది డిసెంబర్ 26 నుంచి ఈనెల 10 వరకు అవకాశం కల్పించింది. ప్రజల నుంచి వచ్చిన విన్నపాలతో పాటు చలాన్ల చెల్లింపుల్లో లక్ష్యం చేరకపోవడంతో ఈనెలాఖరు వరకు అవకాశం ఇస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ఇప్పుడు కూడా ప్రజలు చలాన్లు చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. జరిమానా చెల్లించేందుకు మరో ఎనిమిది రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఫైన్లు చెల్లించకుండా గడువు ముగిసిన తర్వాత వాహనాలు రోడ్లపై తిరిగితే సీజ్ చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరిస్తున్నారు.

రూ.5.45 కోట్లు పెండింగ్

జిల్లాలోని అన్ని ఠాణాల పరిధిలో 1,92,047 కేసులు ఈ చలాన్ల రూపంలో పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసు అధికారుల గణాంకాలు తెలుపుతున్నాయి. వీటికి వాహనాదారులు ఏకంగా రూ.5.45కోట్ల చెల్లింపులు చేయాల్సి ఉంది. వీటిని వందశాతం చెల్లించేలా ప్రభుత్వం భారీ డిస్కౌంట్ ప్రకటిస్తూ గత డిసెంబర్ 26న ఉత్తర్వులు ఇచ్చింది. దీనిలో ఇప్పటి వరకు 1,72,664 కేసుల్లో రూ.1,12,71,990 చెల్లింపులు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. కాగా ఇప్పటి వరకు 20.6 శాతం చలాన్లు వసూలైనట్లు తెలుస్తోంది.

పట్టుబడినా పైసలు కడుతలేరు

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వాహనదారులు జరిమానాలు చెల్లించాలని ఎస్పీ పలుమార్లు ప్రకటనలు చేశారు. దీనికి రెండు నియోజకవర్గాల్లోని ట్రాఫిక్ ఎస్సైలు రాజు, దిలీప్ ఆధ్వర్యంలో పెండింగ్ చలాన్లు చెల్లించాలని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఫలితంగా జిల్లాలో దాదాపు రూ.5.45 కోట్ల జరిమానాలు పెండింగ్‌లో ఉంటే.. ఇప్పటి వరకు రూ.1.12 కోట్లు మాత్రమే వసూలైనాయి.

ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు

ట్రాఫిక్ నిబంధనల ప్రకారం వాహనాలపై వేసిన జరిమానాలపై ప్రభుత్వం రాయితీలు ప్రకటించిన విషయం తెలిసిందే. ద్విచక్ర, మూడు చక్రాల వాహనాల జరిమానాలపై 80 శాతం, ఆర్టీసీ బస్సులు 90 శాతం, లైట్ మోటార్, హెవీ మోటార్ వాహనాల జరిమానాలపై 60 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

జిల్లాలోని వాహనాల వివరాలు..

ఆటోలు	3,507
స్కూల్ బస్సులు	174
గూడ్స్ క్యారియర్స్	3,299
అంబులెన్స్‌లు	37
మోటార్ కార్లు	11,723
బైక్‌లు	94,663
మోటార్‌క్యాబ్‌లు	232
ట్రాక్టర్‌లు	9,182
గూడ్స్ క్యారేజీలు	3,213

నెలాఖరులోగా చెల్లించాలి



ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 31వ తేదీతో గడువు ముగుస్తుంది. నెలాఖరులోగా జరిమానా చెల్లించకుంటే.. తర్వాత రోడ్లపైకి వచ్చిన వాహన యజమానులు వందశాతం ఫైన్ చెల్లించాల్సిందే. 31వ తేదీ తర్వాత జరిమానా ఉన్న వాహనాలు రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటాం. – అఖిల్ మహాజన్, ఎస్పీ

మంచి అవకాశం



వాహనాలపై ఉన్న జరిమానాలను ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు అవకాశం ఉంది. రాయితీ కూడా భారీగా ఉంది. పేద, మధ్యతరగతుల వారికి మంచి అవకాశం. జరిమానా చెల్లించకుండా మళ్లీ పట్టుబడితే వందశాతం చెల్లించాల్సిందే. గడువులోగా జరిమానా చెల్లించాలి. – దిలీప్, ట్రాఫిక్ ఎస్సై, వేములవాడ

కుంగిపోవద్దు.. భవిష్యత్ మనదే

- బీజేపీ, కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- కక్ష సాధింపు చర్యలను ఎదుర్కొందాం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే గంగుల, వినోద్ పిలుపు



మాట్లాడుతున్న కేటీఆర్



కాంగ్రెస్ 420 అంటూ నినదిస్తున్న బీఆర్‌ఎస్ మహిళా నేతలు

కరీంనగర్: ఓటమితో కుంగిపోవద్దని, రానున్న రోజులు మనవేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టి రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేసేందుకు కార్యకర్తలు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. బుధవారం రేకుర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కరీంనగర్‌పార్లమెంటరీ నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యమ నేత కేసీఆర్ సీఎంగా తెలంగాణను అగ్రగామిగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ప్రజలు సానుభూతితోనే కాంగ్రెస్ పార్టీని గెలిపించారని, అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నైజాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని సూచించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు కొద్ది ఓట్ల తేడాతోనే ఆదరించారని, ఆరు నెలల్లోనే వారి పరిపాలనపై అసహనం నెలకొననున్నందని జోస్యం చెప్పారు. సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్, బీజేపీల వైఖరిని ఎండగట్టి రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌కు అండగా నిలిచేలా ప్రజానీకాన్ని మలుచుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోషల్ మీడియాను నమ్ముకుని పదవి సాధించారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్స్ పట్టుదలతో పని చేయాలని సూచించారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించే దిశగా సోషల్ మీడియా వారియర్స్ సిద్ధంగా ఉండాలని సూచించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. తన గొంతులో ప్రాణమున్నంత వరకు బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. సోషల్ మీడియా రాష్ట్ర ప్రతినిధులు క్రిశాంక్, సతీశ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు సోషల్ మీడియాపై స్క్రీనింగ్ ద్వారా శిక్షణ ఇచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వొడితెల సతీశ్‌బాబు, కోరుకంటి చందర్, పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, మేయర్ వై.సునీల్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, రవీందర్‌సింగ్, పార్టీ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, జీవీ.రామక్రిష్టారావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గిరిజన రైతు మృతి

- సోదరుడితో భూ వివాదం కారణంగా ఆత్మహత్యాయత్నం
- పరిహారం చెల్లించాలని కుటుంబసభ్యుల ఆందోళన



నాజం (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సోదరుడే తన భూమిని కాజేయడంతో మనస్తాపానికి గురైన ఓ గిరిజన రైతు క్రిమిసంహారక మందు తాగగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. తమకు న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. వారి వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగుండారం పరిధి పోచమ్మతండా చెందిన బానోతు నాజం(42) బతుకుదెరువు కోసం ఆరేళ్లపాటు గల్ఫ్ వెళ్లాడు. అక్కడినుంచి పంపించిన డబ్బులతో ఆయన సోదరుడు గణేశ్ రెండెకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసి, తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ క్రమంలో ఏడాది క్రితం స్వగ్రామం వచ్చిన నాజం ఆ భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని గణేశ్‌ని అడిగాడు. దీనికి అతను నిరాకరించడంతో 8 నెలల క్రితం కుల పెద్దలను ఆశ్రయించాడు. ఈ విషయంలో వారు కూడా న్యాయం చేయలేదు. భూమి ఆయన పేరిట లేకపోవడంతో రైతుబంధు డబ్బులు కూడా రావడం లేదు. తనకు ఇక భూమి దక్కదని మనస్తాపానికి గురై, గత గురువారం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు దవాఖానా ఎదుట ఆందోళనకు దిగారు. భూ వివాదం వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని, ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య జ్యోతి వేడుకుంది. తమకు న్యాయం చేసేవరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించవద్దని కోరింది. నాజంకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పెద్ద మనుషులు జోక్యం చేసుకొని, పరిహారంపై చర్చలు జరుపుతున్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ



పగులగొట్టిన బీరువా

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని దేశాయిపేట గ్రామంలో తాళం వేసిన రెండిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిరంగి దేవలక్ష్మి బుధవారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి అదే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి, బీరువాను పగులగొట్టి, 4 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే, జక్కుల బాలయ్య కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి, బయటకు వెళ్లగా దొంగలు పడి, రూ.4 వేలు ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

చిరుత కాదు.. హైనా!



మేడిపల్లి శివారు భూమిలో పాదముద్రలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని మేడిపల్లి శివారులో చిరుత సంచారంపై అటవీ శాఖ అధికారులు స్పష్టత ఇచ్చారు. మెట్‌పల్లి–అమ్మక్కపేట మధ్య రైల్వే గేటు వద్ద మంగళవారం రాత్రి చిరుత సంచరించినట్లు సోషల్ మీడియాలో ఓ ఫొటో వైరల్ అయిందన్నారు. కానీ, అది చిరుత కాదని తేల్చిచెప్పారు. బుధవారం మేడిపల్లికి చెందిన పీసు భూమయ్య అనే రైతు వ్యవసాయ భూమిలో పాదముద్రలను గుర్తించిన అధికారులు అవి హైనా పాదముద్రల మాదిరిగా ఉన్నాయని పేర్కొన్నారు. సమీప ప్రాంత ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

నేడు వేములవాడకు మంత్రి సీతక్క రాక

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు మంత్రి సీతక్క గురువారం ఉదయం 7 గంటలకు వస్తున్నట్లు ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

నూతన కార్యవర్గం

సిరిసిల్లటౌన్: పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు మ్యాడారం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి టేకుమల్ల శ్రీకాంత్ బుధవారం ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూర శ్రీనివాస్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా కె.హరేందర్‌రెడ్డి, జయసేనారెడ్డి, సుభాష్‌రెడ్డి, జిల్లా మహిళా అసోసియేట్ అధ్యక్షుడు హెచ్.శిరోమణి, వైదేహి, కల్పన, ఉపాధ్యక్షులు భానుతేజ తదితరులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నిబంధనలు పాటించాలి

సిరిసిల్లటౌన్: నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరుగవని సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్సై రాజు పేర్కొన్నారు. సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో ఉత్తమ డ్రైవర్లుగా ఎన్నికైన భూక్య మోహన్, మనువాడ ప్రశాంత్‌కుమార్, మాలోత్ గణపతిని సన్మానించారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): న్యాయపరమైన చిక్కులు తొలగించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు కోరారు. మండలంలోని అల్మాస్‌పూర్ కేజీబీవీలో బుధవారం టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. స్థానికత కోల్పోయిన జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న 13 జిల్లాల స్పౌజ్ బదిలీలు చేపట్టాలని కోరారు. పాఠశాల ప్రత్యేకాధికారి అజంతా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మై వేములవాడ ట్రస్టు సభ్యులకు సన్మానం

- మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి
- ట్రస్టు సభ్యుల సేవలకు అభినందనలు



కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ: కరోనా మహమ్మారి కఠినంగా వ్యవహరిస్తున్న క్రమంలో దోస్తులంతా కలసి ఓ వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి వేయి రోజులుగా పేదలకు సహాయం చేస్తున్న సభ్యులను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి సన్మానించారు. కేక్ కట్ చేసి పేదలకు పంచిపెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. మధు మహేశ్, తిరుమల్‌గౌడ్, గొంగళ్ల రవికుమార్, పొలాస రాజేందర్, ప్రతాప నటరాజ్, ప్రతాప సంతోష్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, కొప్పుల హనుమాన్, భస్మాంగి బస్వరాజు, తాళ్లపల్లి ప్రశాంత్, వొడ్యాల వేణు, కళా అశోక్, చల్లా సత్తయ్య, గొండ ప్రసాద్, వీరగొని ఆంజనేయులు, గుండర్స్ మాధవ్, డాక్టర్ శోభారాణి, డాక్టర్ అక్షిత, తోట లహరి ఉన్నారు.

రాహుల్ యాత్ర అడ్డుకోవడం అప్రజాస్వామికం

- దళితుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం
- కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ రాజమల్లయ్య



మాట్లాడుతున్న రాజమల్లయ్య

సిరిసిల్లటౌన్: రాహుల్‌యాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ ఎన్నం రాజమల్లయ్య పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ జీర్ణించుకోలేకపోతుందన్నారు. ప్రజాసమస్యలను స్వయంగా తెలుసుకుంటూ పాదయాత్ర సాగిస్తున్న రాహుల్‌గాంధీని అడ్డుకోవడానికి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కుట్రపూరితంగా మోదీ సర్కార్ వ్యవహరిస్తుందన్నారు. దళితుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, నాయకులు రొడ్డ రాంచంద్రం, మంగ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీడీ స్టోర్ పేరిట మోసం

- సైబర్ నేరగాళ్ల వలలో జిల్లా ప్రజలు

సిరిసిల్లక్రైం: తమ సరుకుల వివరాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో ప్రతీ నెల సొమ్ము ఇస్తామని చెప్పిన ఏబీడీ స్టోర్ నిర్వాహకులు ముందుగా చెప్పిన విధంగా డబ్బులు ఇవ్వడం లేదని జిల్లా కేంద్రంలో బాధితులు లబోదిబోమంటున్నారు. ముందుగా ఏబీడీలో ప్రచారం చేయడానికి కనీసంగా రూ.600 చెల్లించాలని, తర్వాత ఒక సరుకు గురించి మూడు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే నెలకు వేలల్లో జీతం ఇస్తామని ఆన్‌లైన్‌లో కొందరు వలవేశారు. ఇంటిలో ఉంటూ పనిచేయడం సులభమని నమ్మిన పలువురు మహిళలు వారికి తెలిసిన వారిని ఈ ప్రచారంలో భాగస్వాములను చేశారు. గత ఆరు నెలలుగా వేలాది మంది రూ.600 చెల్లించి ఏబీడీ స్టోర్ పేరిట ఉన్న ప్రకటనలను ప్రచారం చేసినట్లు ఓ బాధితుడు తెలిపారు. ముందు మూడు నెలలు ఫోన్‌లో పలువురు వ్యక్తులు రోజూ మాట్లాడారని, తర్వాత మాట్లాడడం బంద్‌చేశారని తెలిపారు. ఇప్పుడు కనీసం ఫోన్‌చేస్తే సమాధానం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఇంట్లో ఉండి పనిచేయడం పేరిట లక్షల రూపాయలను గొలుసు వ్యాపార విధానంలో సైబర్ నేరగాళ్లు లాగేసినట్లు తెలిసింది. దీనిపై కొందరు వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

నువ్వులలో విత్తన శుద్ధి



విత్తనశుద్ధి చేస్తున్న విద్యార్థులు

రుద్రంగి(వేములవాడ): పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం(ఆర్‌ఏడబ్ల్యూఈపీ)లో భాగంగా బుధవారం మానాలలో నువ్వులలో విత్తన శుద్ధి చేసి పంట విత్తారు. నువ్వులలో తొలిదశలో ఆశించే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవడానికి విత్తనశుద్ధి ఉపయోగ పడుతుందన్నారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు వేముల అఖిల, మెరుగు సింధూజ, గాలి అమూల్య, చిలుకుల సుష్మప్రియాంక, వ్యవసాయ విస్తరణాధికారి విజయ్, రైతులు పాల నర్సు, గంగు, గణేష్, బానోత్ రాజు, కుర్తిలాల్, అజ్మీర రవీందర్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

- ఆర్డీవో మధుసూదన్



నాయకులతో సమావేశమైన ఆర్డీవో

వేములవాడ: జనవరి 1, 2024 వరకు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని ఆర్డీవో మధుసూదన్ సూచించారు. తన కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించుకోవాలన్నారు. తహసీల్దార్ మహేశ్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ శ్రవణ్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పొలాస నరేందర్, నిత్యానంద రావు, ఎస్.రాము, జింక ఎల్లయ్య పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన పత్తి



మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది



దగ్ధమైన సామగ్రిని పరిశీలిస్తున్న ఆర్ఐ తిరుపతి

వేములవాడ అర్బన్: వేలాడుతున్న విద్యుత్ తీగలు పత్తి లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌కు తగిలి షార్ట్‌సర్క్యూట్ జరిగింది. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రెడ్డి కాలనీలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మంటలు చెలరేగడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. వారు ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న సుమారు 5 క్వింటాళ్ల పత్తి కాలిపోయినట్లు రైతు ఇన్నారెడ్డి తెలిపారు.

వెంకటేశ్వరపల్లిలోని ఇంట్లో సామగ్రి

జమ్మికుంట(హుజూరాబాద్): షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. బాధితుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన రామడుగు సంపత్‌రావు బుధవారం తన పొలం వద్దకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి, మంటలు లేచాయి. లోపల వస్తువులన్నీ కాలిపోయాయి. రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. సంఘటన స్థలాన్ని ఆర్ఐ తిరుపతి పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సర్పంచ్ కుమార్, గ్రామస్తులు కోరారు.

నాల్గో తరగతి ఉద్యోగుల అధ్యక్షుడిగా కుమారస్వామి



ఉద్యోగ సంఘం బాధ్యులతో అడిషనల్ కలెక్టర్

సిరిసిల్లఎడ్యుకేషన్: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కుమారస్వామిని ఉద్యోగులు ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యదర్శిగా జీవన్, కోశాధికారిగా వెంకటసత్యం ఎన్నికయ్యారు.